క్లుప్తంగా

11న నగరంలో సైకిల్ ర్యాలీ

నెహ్రూనగర్: కాలుష్య రహిత నగరంగా గుంటూరును మార్చుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వి నర్చర్ ఐటీ చైర్మన్ సంపూర్ణ పేర్కొన్నారు. గురువారం ఇన్నర్‌రింగ్ రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు, ప్రతి ఒక్కరూ కాలుష్య రహిత నగర సాధన దిశగా సాగిందేకు యువతతో కలిసి 11న గుంటూరు నగరంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఇంట్లో చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధిత మహిళ సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేసింది. వివరాల్లోకి వెళితే శ్యామలా నగర్ 1వలైనుకు చెందిన సుజాత అనే మహిళ గృహంలో వారం రోజుల క్రితం ఐదున్నర సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. ఇంట్లో అందరూ ఉన్న సమయంలోనే నగలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వెళ్లగా పోలీసులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన పోలీసులు గురువారం చోరీ ఘటనపై కేసు నమోదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ నరేంద్రబాబు తెలిపారు.

పట్టాభిపురం పీఎస్ ఎస్‌హెచ్‌ఓగా వీరేంద్రబాబు



గుంటూరు ఈస్ట్: పట్టాభిపురం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ పి.వీరేంద్రబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. వీరేంద్రబాబు 2007లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో విధుల్లో చేరారు. 2016లో సీఐగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం నరసరావుపేట–2 సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై పట్టాభిపురం పోలీసు స్టేషన్‌కు వచ్చారు.

వెండితెర వెన్నెల సంతకం సావిత్రి

లక్ష్మీపురం: మహానటి సావిత్రి అంటే వెండి తెర మీద వెన్నెల సంతకమని సినీరంగ విశ్లేషకుడు అవధానుల అమరాచారి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సావిత్రి జయంతి వేడుకల్లో భాగంగా ముందుగా ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహానటి సావిత్రి తెలుగు తెరపై ప్రకాశించి మన మధ్యలేకున్నా నేటికీ వెలుగులు చిమ్ముతున్నారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, రచయిత కె.జయకుమార్, విశ్రాంత ఇంజినీర్ ఘనశ్యామాచార్యులు తదితరులు నివాళులర్పించి ప్రసంగించారు.

నగలు పోగొట్టుకున్న ఘటనపై కేసు

గుంటూరు ఈస్ట్: షాపులో మహిళ నగలు పోగొట్టున్న ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదాకాలనీకి చెందిన నాగలక్ష్మి హరిహరమహల్‌సమీపంలో ఓ స్వీట్‌షాపులో పనిచేస్తుంది. గత నెల 26వ తేదీ నాగలక్ష్మి మూడున్నర సవర్ల బంగారపు గొలుసు కవరులో పెట్టుకుని జాగ్రత్త పరుచుకుని షాపునకు వెళ్లింది. పనులు పూర్తి చేసుకుని బయటకు వచ్చిన తరువాత వెంట తెచ్చుకున్న గొలుసు ఉన్న కవరు కనిపించలేదు. షాపునకు వెళ్లి పరిశీలించగా బాత్‌రూము వద్ద కవర్ మాత్రమే కనిపించింది. ఘటనపై బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేజండ్ల పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

చేబ్రోలు: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన చేబ్రోలు మండలం వేజండ్ల పంచాయతీ కార్యదర్శి డి.సాంబశివరావును జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. ఈ నెల 2,3వ తేదీల్లో ఎన్నికల సంఘం స్పెషల్ క్యాంపెయిన్ డేను ప్రకటించింది. వేజండ్ల 101 పోలింగ్ కేంద్రం బీఎల్‌ఓ అయిన వేజండ్ల పంచాయతీ కార్యదర్శి శని, ఆదివారాల్లో ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యాడు. అధికారుల తనిఖీ సమయంలో పోలింగ్ కేంద్రం తాళం వేసి ఉండటంతో తహసీల్దార్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు కలెక్టర్ పంచాయతీ కార్యదర్శి సాంబశివరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ బైక్‌ను కారు ఢీ కొట్టడంతో ఇంజినీరింగ్ విద్యార్థికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామ పరిధిలో గురువారం జరిగింది. మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న గుంటూరుకు చెందిన కె.కమలాకర్ ద్విచక్ర వాహనంపై నారాకోడూరు వైపు వెళ్తున్నాడు. వేజండ్ల అడ్డరోడ్డు సమీపంలో కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కమలాకర్‌కు ముఖానికి, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలైనాయి. అతనిని 108 వాహనం ద్వారా వడ్లమూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరద నీటితో జరభద్రం!

- తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం
- అతిసార ప్రబలే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు



గుంటూరుమెడికల్: కొద్దిరోజులుగా తుఫాన్ ప్రభావం వల్ల జిల్లాలో వర్షాల వల్ల వరద నీరు చేరింది. జిల్లావ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో వ్యాధులు ప్రభలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటుచేశారు. కాకుమాను, చేబ్రోలు, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, తాడేపల్లి, పెదకాకాని తదితర మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో వైద్యశిబిరంలో 24 గంటలు అందుబాటులో ఉండేలా వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించారు. ఒక్కో ఏరియాకు ఒక్కో ప్రోగ్రాం ఆఫీసర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు ప్రతిరోజూ ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ వైద్య సిబ్బందికి తగు ఆదేశాలు జారీచేస్తున్నారు. పాముకాటు, తేలుకాటు, డయేరియా కేసులు, అలర్జీ, చర్మ సంబంధిత కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్న దృష్ట్యా వాటి నివారణ కోసం అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచారు. వరద నీటి ప్రవాహం తగ్గిన పిదప వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్న దష్ట్యా అన్ని ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవటం పాటుగా వైద్య సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు.

అతిసార వ్యాధి కేసులు నమోదయ్యే అవకాశాలు...

వరద ప్రభావిత ప్రాంతాల్లో డయేరియా కేసులు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి. వ్యాధి బారిన పడకుండా ముందస్తుగా వ్యాధిపై అవగాహన కల్గి ఉండి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. విరోచనాలు నీళ్ల నీళ్లుగా, పలచగా అవుతుంటే డయేరియా (అతిసార వ్యాధి) అంటారు. వైద్య పరిభాషలో దీనిని గ్యాస్ట్రో ఎంటరైటిస్‌గా పిలుస్తారు. నీళ్ల విరోచనాలు నూటికి 70శాతం వైరస్ క్రిముల వల్ల వస్తాయి. కలుషితమైన నీటిని తాగటం వల్ల, మలం మీద వాలిన ఈగలు ఆహార పదార్థాలపై వాలాక ఆ ఆహారం తినటం ద్వారా వివిధ రకాల బ్యాక్టీరియా, వైరస్‌లు శరీరంలోకి ప్రవేశించి విరేచనాలు అవుతాయి.

లక్షణాలు...

జీర్ణవ్యవస్థ పనితీరు అస్తవ్యస్తంగా ఉండి వాంతులు, విరేచనాలు అవుతాయి. విరేచనాలు నీళ్ల, నీళ్లుగా పలచగా కావటం, కడుపులో మెలిపెట్టినట్లు నొప్పి ఉంటుంది. నీరసం, వికారం, వాంతులు, శరీరంలో లవణాలు పోయి పిక్కలు నొప్పులు వస్తాయి. మనం తాగే నీరు శరీరం నుంచి అధిక మొత్తంలో బయటకు వెళ్లిపోతే డీహైడ్రేషన్ ఏర్పడి ప్రమాదకర పరిస్థితి ఏర్పడుతుంది. దీనివల్ల పిల్లలకు, వృద్ధులకు ఎక్కువ ప్రమాదం.

పాముకాటులు నమోదయ్యే అవకాశాలు...

వర్షం, వరదల వల్ల భూమిలోపలి పొరల్లోకి నీరుచేరి కన్నాలు, బొరియలు పూర్తిగా నీటితో నిండిపోతాయి. దీంతో ఉండేందుకు వీలులేని పరిస్థితుల్లో పాములు బయటకు వస్తాయి. పొలాలు, డొంకల్లో అటూ ఇటు తిరిగేవారు తమను చంపేందుకు వచ్చారేమోననే భయంతో పాములు కాటువేస్తాయి. అలాంటి సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చు.

పాము కరిచినప్పుడు...

పాము కరిచిన వెంటనే కాటు వేసిన భాగాన్ని మొట్టమొదటిగా పరీక్షించాలి. కాటు వేసిన ప్రదేశంలో రెండుగాట్లు మాత్రమే ఉంటే అది విషంతో కూడిన పాముకాటుగా గుర్తించాలి. కరిచిన శరీర భాగంలో వాపురావటం, నల్లగా కమిలినట్లు ఉండటం, నొప్పి ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. రెండుగాట్లు లేకుండా వి ఆకారంలో కింద, పైన పళ్ల గుర్తులు ఉంటే అది విషం లేని పాము కాటు అని తెలుసుకుని బాధితుడికి ముందుగా బాగా ధైర్యం చెప్పాలి.

పిల్లలు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి...



డయేరియా వల్ల పెద్దవారికంటే పిల్లలకు ఎక్కువగా ఇబ్బందికరమైన పరిస్థితులు వస్తాయి. వ్యాధి లక్షణాలు గుర్తించి దాహం పెరిగితే ఓఆర్ఎస్ ప్యాకెట్లు తాగించాలి. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తారు. ఒక ప్యాకెట్ పౌడర్‌ను లీటర్ నీటిలో కలుపుకొని తాగాలి. విరేచనాలు అయ్యేవారికి కారం, మసాల వంటి ఘాటు పదార్థాలు పెట్టకూడదు. ద్రవరూపంలో ఉండే ఆహారం అందజేయాలి. మజ్జిగ, పాలు, బార్లీగంజి, పలచగా తయారు చేసిన సగ్గుబియ్యం, రాగి జావ, కొబ్బరినీళ్లు, నిమ్మ రసం, సోయాబీన్స్ రసం, ఇతర పళ్లరసాలు ఇవ్వొచ్చు.

– డాక్టర్ బి.రమేష్, పీడియాట్రిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

డయేరియా రాకుండా ఇలా చేయాలి...



మలమూత్ర విసర్జన పిదప, భోజనం చేసేముందు తప్పనిసరిగా సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగటం చాలా ఉత్తమం. రోడ్డుపైన, తోపుడు బండ్లపై మూతలు లేకుండా అమ్మే ఆహార పదార్థాలు తినకుండా ఉండాలి. ఇంట్లో వైద్యాలు, మందుల షాపుల వద్దకు వెళ్లి మందులు తెచ్చుకోవటం చేయవద్దు. డయేరియా వచ్చినప్పుడు అర్హత ఉన్న వైద్యనిపుణుడి వద్దకు వెళ్లాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్, గుంటూరు జీజీహెచ్

ప్రత్యేక వైద్య శిబిరాలు



వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 24 గంటలూ వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం. ఆరోగ్య కేంద్రాలు సైతం రాత్రి వేళల్లో పనిచేసేలా ఏర్పాట్లు చేశాం. పాముకాటు ఇంజక్షన్లు, డయేరియా నియంత్రణ మాత్రలు, జ్వరాలు ఇతర వ్యాధుల నియంత్రణ మందులు అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలి. తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

విద్యుత్ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాలి

మేయర్ కావటి మనోహర్ నాయుడు



ఎలక్ట్రికల్ ఎస్ఈతో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: వాసవి క్లాత్ మార్కెట్‌లో విద్యుత్ అంతరాయ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు ఎ.పి.సి.పి.డి.సి.ఎల్ ఎస్ఈని కోరారు. గురువారం మార్కెట్ అసోసియేషన్ సభ్యుల వినతి మేరకు వారితో కలిసి ఎలక్ట్రికల్ ఎస్ఈని మార్కెట్‌లో విద్యుత్ అంతరాయ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కాకాని రోడ్డులోని వాసవి క్లాత్ మార్కెట్‌కు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దుస్తుల కొనుగోలుకు ప్రజలు అధిక సంఖ్యలో వస్తారని, మార్కెట్‌లో షాపుల సంఖ్య పెరిగిందని, అందుకనుగుణంగా మార్కెట్ విద్యుత్ అవసరాలు తీరేలా శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎస్ఈ మురళీ కృష్ణాయాదవ్‌ను కోరారు. స్పందించిన ఎస్ఈ మాట్లాడుతూ త్వరలో విద్యుత్ శాఖ అధికారులు మార్కెట్‌ను పరిశీలించి డిమాండ్‌ను అంచనా వేసి అందుకు తగిన విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు అడ్డగిరి సాంబశివరావు, కార్యదర్శి మురారిశెట్టి సుబ్బారావు, డీఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆనందంగా ఇళ్లకు చేరిన తుఫాన్ బాధితులు

81 కుటుంబాలకు రేషన్ సరుకులు, రూ.1,52,000 నగదు పంపిణీ



తుఫాన్ బాధితులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ నగేష్

పెదకాకాని: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల పాటు పునరావాస కేంద్రాల్లో తల దాచుకున్న బాధితులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు అల్పాహారం, భోజనం, మౌలిక వసతుల కల్పన వంటి ఏర్పాట్లు చేశారు. మండలంలోని నంబూరు యానాదికాలనీ వాసులు 56 కుటుంబాలు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్నారు. పెదకాకాని బాజీనగర్‌లో స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో 25 కుటుంబాల వారిని ఉంచారు. వర్షం పూర్తిగా తగ్గడంతో వారిని క్షేమంగా, ఆనందంతో ఇళ్లకు వెళ్లేవిధంగా చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి 25 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, కిలో నూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళదుంపలు చొప్పున పంపిణీ చేశారు. అలానే గురువారం రాత్రి 81 వరదబాధితుల కుటుంబాలకు పరిహారంగా రూ.1,52,000 పంపిణీ చేశారు. వరద బాధితులు ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్ఐ రాజేశ్వరి, వీఆర్వోలు జయంతి, మహేష్, కృష్ణకిషోర్, వైఎస్సార్ సీపీ నాయకులు భీమవరపు విజయలక్ష్మి, జొన్నల అవినాష్‌రెడ్డి, సయ్యద్ సుబాని, భీమవరపు కోటిరెడ్డి, షేక్ ఆరిఫ్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులపై నివేదిక ఇవ్వాలి

జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి



కాంట్రాక్టర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ ఛాంబర్‌లో నగరంలోని కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రజా ప్రతినిధులు, ప్రజలతో మమేకమై ఉంటారని, వారు గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం తుఫాన్ కారణంగా నగరంలో ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావచ్చని కార్పొరేటర్లకు సూచించారు. ఇప్పటివరకు వార్డుల వారీగా కార్పొరేటర్లు అందించిన అర్జీలు, వాటి పరిష్కారంపై నివేదిక ఇవ్వాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. వార్డుల్లో మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై కార్పొరేటర్లు కూడా కమిషనర్‌తో చర్చించడానికి ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా సమయం కేటాయించడం జరిగిందన్నారు. మిగిలిన రోజుల్లో కార్పొరేటర్లకు అందుబాటులో ఉంటామని, వాట్సాప్‌లో సమస్యలు తెలిపినా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనలను క్రమపద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు కూడా వారికి తెలియజేయాలని ఆదేశించారు.

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి..

నగరంలో టెండర్ పొందిన కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలని, కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం కమిషనర్ ఛాంబర్ లో నగరపాలక సంస్థ కాంట్రాక్టర్లతో కమిషనర్ స్పెషల్ గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో అభివృద్ధి పనులు నిర్వహించే కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తెచ్చారని, వాటిని నిర్దేశిత గడువులో పరిష్కారం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కాంట్రాక్టర్లు వర్క్ అగ్రిమెంట్ పొందిన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసినప్పుడే నగర అభివృద్ధి జరుగుతుందని, కాంట్రాక్టర్లు తాము పూర్తి చేసిన పనులకు సంబంధించి బిల్లుల ఆన్‌లైన్ చేయడం, చెల్లింపుల్లో ఎదురయ్యే సమస్యలను ప్రతి శుక్రవారం జరిగే స్పెషల్ గ్రీవెన్స్‌లో తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కాంట్రాక్టర్లు అందించిన అర్జీలను, ఫిర్యాదులను ప్రత్యేకంగా నమోదు చేయాలని, వారి సమస్యలు పరిష్కారం అయ్యాక తెలియచేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లుల చెల్లింపులో జాప్యం లేకుండా అన్ని స్టేజిల్లో వేగంగా రికార్డ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. కాంట్రాక్టర్లు తాము చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.

కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, కార్మికులకు అందాల్సిన పరిహారాలు వెంటనే అందిచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ఇంజినీరింగ్ విభాగం కార్మికురాలు వి.విజయకుమారి కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా చెక్‌ను గురువారం కమిషనర్ చాంబర్‌లో ఆమె భర్తకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో గాంధీ పార్క్‌లో విధులు నిర్వహించే టి.విజయకుమారి ఇటీవల కాలంలో మరణించారని ఆమె భర్త రమణారావుకు నగరపాలక సంస్థ నుంచి ఎక్స్ గ్రేషియా రూ.2 లక్షలు, మట్టి ఖర్చులు రూ.15 వేలకు సంబంధించిన చెక్‌ని అందించామన్నారు. అదే విధంగా నగరపాలక సంస్థ నుంచి అందాల్సిన పరిహారాలు, పి.ఎఫ్. కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగాధిపతులను, సూపరింటెండెంట్లను ఆదేశించారు.

నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు..

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో మిచాంగ్ తుఫాన్ అనంతరం అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రణాళికాబద్ధంగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం తుఫాన్ అనంతరం నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనుల నిర్వహణపై డిప్యూటీ కమిషనర్, ఎంహెచ్‌ఓ, శానిటరీ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ వలన వర్షం నీరు నిల్చిన ప్రాంతాల్లో బెయిల్ అవుట్ చేశాక ప్రజారోగ్య సిబ్బంది తప్పనిసరిగా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, అందులో భాగంగా బ్లీచింగ్ చల్లడం, రోడ్ల మీద పేరుకున్న సిల్ట్ తొలగించడం, కల్వర్ట్‌ల వద్ద నిలిచిన అడ్డంకులను తొలగించాలన్నారు. డిప్యూటీ కమిషనర్ రవీంద్ర, ఎంహెచ్‌ఓ (ఎఫ్ఏసీ) మధుసూదన్, ఎస్ఎస్‌లు ఆనందకుమార్, ఆయుబ్ ఖాన్, సోమ శేఖర్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు దిక్సూచీగా ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్



యూటీఎఫ్ నాయకులతో కలిసి ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అధిక మార్కుల సాధన దిశగా యూటీఎఫ్ ముద్రించిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ ప్రయోజనం చేకూర్చుతాయని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం యూటీఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సీ మోడల్ పేపర్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ మోడల్ పేపర్స్ ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. మోడల్ పేపర్స్ బుక్‌లెట్‌లో ముందుమాటను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ రాశారని తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో అధిక మార్కులను సాధించేందుకు వీలుగా వ్యాపార ధోరణితో కాకుండా నామమాత్రపు ధరకే పుస్తకాన్ని అందించడం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల ప్యాట్రన్‌లోనే టెన్త్ సబ్జెక్టుల బోధనలో రాష్ట్రస్థాయిలో నిపుణులైన ఉపాధ్యాయులతో మోడల్ పేపర్లను రూపొందించామని, ప్రతి యేటా అత్యుత్తమ మోడల్ పేపర్లను అందించడంలో యూటీఎఫ్‌కు గుర్తింపు ఉందని చెప్పారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మాట్లాడుతూ విద్యార్థులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంఘ జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, కోశాధికారి ఎండీ దౌలా, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందయ్య, కేదార్‌నాథ్, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ప్రభూజీ, ప్రేమ్‌కుమార్, టి.వినోద, అంకమ్మరావు, యశోధర పాల్గొన్నారు.

మదమంచి రామస్వామి ట్రస్టు స్వాధీనం

ఈఓ జె.వి.నారాయణ

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బస్టాండు ఆవరణలో ఉన్న మదమంచి రామస్వామి ట్రస్టు భవనాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఈఓ జె.వి.నారాయణ తెలిపారు. స్థానిక చెన్నారెడ్డి ధర్మసత్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ట్రస్టు భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, దాత ఆశయాలు కొనసాగించడం లేదంటూ కొద్ది నెలల కిందట ప్రత్తిపాడుకు చెందిన కొందరు దేవదాయశాఖ ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని, ఫిర్యా దుపై పలు దఫాలుగా ఏసీ, డీసీ, కమిషనర్ స్థాయి ల్లో విచారణలు జరిగాయన్నారు. విచారణల అనంతరం దేవదాయశాఖ గెజిట్ పబ్లికేషన్ జారీ చేసి, సెక్షన్–43 రిజిస్టర్ అప్రూవల్ చేసి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించిందని ఈఓ తెలిపారు. ఈ నేపథ్యంలో ట్రస్టుకు సంబంధించిన భవనానికి గురువారం సాయంత్రం తాళాలు వేసి ప్రకటన కూడా అంటించామన్నారు. అంతేకాకుండా ట్రస్ట్ కిందట ఉన్న నాలుగు దుకాణాల నుంచి అద్దెలు కూడా వసూలు చేసుకున్నామని ఈఓ తెలిపారు. ట్రస్టుకు ప్రత్తిపాడులో రెండు ఎకరాలకు పైగా కమర్షియల్ భూమి ఉందని, మరో ఆరు ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు కూడా వేర్వేరు గ్రామాల్లో ఉన్నాయని ఈఓ వెల్లడించారు. ప్రత్తిపాడులో ఉన్న రెండెకరాల భూమిలో మరికొన్ని నిర్మాణాలు కూడా ఉన్నాయని, వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని వివరించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గ్రామస్తుల సమక్షంలో పంచనామా జరిపి పదిరోజుల్లో పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకుంటామని ఈఓ తెలిపారు. స్వాధీనం చేసుకున్న భూముల విలువ సుమారు రూ.5కోట్లు ఉంటుందని చెప్పారు. ట్రస్టుకు సంబంధించిన అన్ని రకాల రికార్డులు అప్పగించాలని ట్రస్టు సభ్యులకు నోటీసులు జారీ చేశామని చెప్పారు.

పోలేరమ్మ హుండీ కానుకలు లెక్కింపు

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరు గ్రామంలో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీ పోలేరమ్మ అమ్మ వారి హుండీ ఆదాయాన్ని గురువారం బాపట్ల దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వి.శ్యామల, ట్రస్టుబోర్డు చైర్మన్ రామినేని నాగవేణి ఆధ్వర్యంలో లెక్కించారు. ఈసందర్భంగా దేవాలయ ఈఓ బత్తుల సురేష్ బాబు మాట్లాడుతూ గత మూడు నెలల కాలానికి అమ్మ వారి హుండీ ఆదాయం రూ.6,54,455లు వచ్చినట్లు తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు మండవ శ్రీనివాసరావు, గుంటుపల్లి నాగేశ్వరరావు, పోలినేని రమేష్‌బాబు, రుద్రపాటి వరలక్ష్మి, కొమ్మబోయిన శేషమ్మ, కొండపాటూరి పేరమ్మ, గ్రామ పెద్దలు, దేవాలయ పూజారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య చర్యలు

గుంటూరు రూరల్: తుఫాన్ ప్రభావం వల్ల గ్రామాలు, శివారు కాలనీల్లో రోగాలు ప్రభలకుండా పంచాయతీ సిబ్బంది పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతిఅంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మండలంలోని చల్లావారిపాలెం, మల్లవరం, తోకావారిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఎంపీపీ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అంటురోగాలు ప్రభలకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు చేరువగా అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజల ఆరోగ్య పరిస్థితులను పర్యవేక్షించాలన్నారు. మురుగు కాల్వల్లో దోమలు నిల్వ లేకుండా చూడాలని, ఆయిల్ బాల్స్ వినియోగించాలని సూచించారు. భాగంగా ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారుల వెంటనున్న చెత్త డంపింగ్‌లను పొక్లెయిన్‌తో తీయించి డంపింగ్‌యార్డ్‌లకు తరలించారు. ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు ఆరుదల సాంబశివరావు, ఏరువ పద్మావతి, జగన్‌మోహన్‌రెడ్డి, గ్రామ సెక్రటరీలు పాల్గొన్నారు.

పొన్నూరు: తుఫాన్ తీవ్రత తగ్గిన నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోగాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. నీటి నిల్వ చేరకుండా, మురుగు కాలువల్లో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. గోళ్లమూడి పాడు గ్రామంలో సర్పంచ్ రాజ్యలక్ష్మీ లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు రోడ్లవెంట పిచ్చి మొక్కలు తొలగించి, నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ చల్లారు.

పంట నష్టం అంచనాల్లో అధికారులు

పెదకాకాని: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పెదకాకాని మండలంలో 9,500 ఎకరాల్లో వరి పంట, 600 ఎకరాల్లో మినుము, 160 ఎకరాల్లో ప్రత్తి, జొన్న 80 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి గురువారం తెలిపారు. పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతుందన్నారు.